ప్రజాశక్తి





రాప్తాడు వద్ద ఏర్పాటు చేసిన సిద్ధం బహిరంగ సభ సభాప్రాంగణం



- హాజరుకానున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి
- రాయలసీమ జిల్లాల నుంచి జనసమీకరణ
- భారీగా ఏర్పాట్లు చేపట్టిన వైసిపి
- దగ్గరుండి చూసుకుంటున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నేడు సిద్ధం సభ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు వైసిపి పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సిద్ధం పేరుతో ప్రాంతీయ సభలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం నాడు అనంతపురం జిల్లా రాప్తాడు మండలం కేంద్రం సమీపంలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తోంది. రాయలసీమ పాత నాలుగు జిల్లాల నుంచి లక్ష మందికిపైగా జనసమీకరణ చేపట్టి తమ బలాన్ని ప్రదర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం రాప్తాడు ఆనుకుని పొలాల్లో 110 ఎకరాల్లో బహిరంగ సభ ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తోంది. భారీ వేదికతోపాటు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మధ్యలో నడిచివెళ్లేందుకు వీలుగా తొమ్మిది అడుగుల ఎత్తులో వాక్‌వేను ఏర్పాటు చేస్తున్నారు. మధ్యలో నడిచే వెళ్లే సమయంలో ముఖ్యమైన వారిని పలుకరించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. మొత్తం ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూడు రోజులుగా ఇక్కడే ఉండి పరిశీలిస్తున్నారు. ఈయనతోపాటు ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్ తలశీల రఘురాం కూడా ఉన్నారు.

భారీ భద్రతా, ట్రాఫిక్ మళ్లింపులు

రాయలసీమ జిల్లాల నుంచి పెద్దఎత్తున జనసమీకరణ చేయనుండటంతో అందుకు తగ్గట్టు భారీ భద్రతా ఏర్పాట్లను పోలీసులు చేపడుతున్నారు. అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తుండగా అదనంగా కడప, నంద్యాల, చిత్తూరు జిల్లాల అదనపు ఎస్పీలు కూడా ఇక్కడికి విచ్చేశారు. సుమారు నాలుగు వేల మంది పోలీసు సిబ్బందిని భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణకు నియమించారు. ఇదే విధంగా ట్రాఫిక్ మళ్లింపులు చేపడుతున్నారు. సభకు వచ్చే వాహనాలకు ఆయా మార్గాల ద్వారా వచ్చే వాటి పార్కింగ్ కోసం 16 స్థలాలను ఏర్పాట్లు చేశారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అనంతపురంలో జరుగుతున్న రాయలసీమ స్థాయి సిద్ధం బహిరంగ సభలో పాల్గొనేందుకు గన్నవరం నుంచి విమానాశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం 2.45 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో రాప్తాడుకు చేరుకుంటారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. సభ అనంతరం ఆయన తిరుగు ప్రయాణంలో హెలీక్యాప్టర్‌లో పుట్టపర్తికి అక్కడి నుంచి గన్నవరంకు బయలుదేరి వెళ్తారు.

రాయలసీమ సమస్యలను ప్రస్తావించేరా ?

నిత్యం కరువులకు నిలయం రాయలసీమ. సాగు, తాగునీటి కష్టాలతోపాటు, ఉపాధి కోసం వలసలు అధికంగా ఉండే ప్రాంతం ఇది. అత్యల్ప సాగునీటి వసతి ఉన్న ప్రాంతం కూడా ఇదే కావడం గమనార్హం. అధికార పార్టీ రాయలసీమ స్థాయిలో నిర్వహిస్తున్న సిద్ధం సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈప్రాంత సమస్యలపై ప్రస్తావిస్తారా.. లేక రాజకీయ అంశాలపైనే దృష్టి పెడతారా అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన కొత్తలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకమని ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టు పనులేవి ముందుకు సాగిన దాఖలాల్లేవు. ఇక పరిశ్రమలు ఒకటి, రెండు ప్రకటించినా ఏర్పాటవలేదు. కడప ఉక్కుపరిశ్రమ ఏర్పాట్లుకు శంకుస్థాపన చేసినా ప్రయివేటు రంగంలోనే అన్న విమర్శ ఉంది. అనంతపురం జిల్లాలో గతంలో ప్రకటించిన కుదురే ముఖ్ ఉక్కు పరిశ్రమ ప్రస్తావన లేకుండా పోయింది. తాగునీటి కోసం తెస్తామన్న వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు మొదలవ లేదు. ఇలా అనేక సమస్యలు రాయలసీమకు సంబంధించి ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేటి సద్ధం సభలో వీటిపైనా ముఖ్యమంత్రి ఎటువంటి ప్రకటన చేయనున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

సభ తరువాత మరింత ఎన్నికల ఊపు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రాప్తాడులో నిర్వహిస్తున్న సిద్ధం సభ అనంతరం ఎన్నికల ఊపు వైసిపిలో మరింత పెరుగుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సభా ప్రాంగణంలో పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల కంటే అత్యధిక స్థానాల్లో వైసిపి గెలుపొందుతుందన్న ధీమాను వ్యక్తం చేశారు. రాయలసీమ జిల్లాలోని ఏడు పార్లమెంటు నియోజకవర్గాల నుంచి వైసిపి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఈ సభకు తరలిరానున్నట్టు తెలిపారు. భారీగా ఈ సభను విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో మూడు సిద్ధం సభలను నిర్వహించినట్టు తెలిపారు. మరో సభ పల్నాడులో నిర్వహించనున్నట్టు వివరించారు.



సిద్ధం సభవద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



ఇళ్ల స్థలాల సమస్యను మున్సిపల్ కమిషనర్‌కు వివరిస్తున్న పెద్దన్న

ఇళ్ల స్థలాల మంజూరులో నిర్లక్ష్యం

దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం వ్యాప్తంగా సొంతిళ్లు లేని నిరు పేదలందరికీ ఇంటి స్థలంతో పాటు గృహాలను మంజూరు చేయాలని, ఇందుక సంబంధించి అర్హులైన వారి నుంచి ఆయా సచివాలయాల్లో ధరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న డిమెండ్ చేశారు. ఇంటి స్థలం, ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తు సిపిఎం నాయకులు సాంబశివ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతు పట్టణంలో నివాసం ఉంటున్న బడగు బలహీన వర్గాల వారు దాదాపు 20 సంవత్సరాల నుంచి సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ ప్రభుత్వం పదవీకాలం ముగుస్తున్నా పేదల సొంతింటి కల మాత్రం నెరవేరలేదన్నారు. దరఖాస్తు చేసుకుని ఏళ్లు గుడస్తున్నా వాటి గురించి పట్టించుకునే వారు లేరని విచారం వ్యక్తం చేశారు. వివిధ నిబంధనల పేరుతో పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. లబ్ధిదారులు ఇచ్చే ధరఖాస్తులను సచివాలయాల్లో ఇస్తే ఆన్‌లైన్ చేయడానికి అనుమతులు లేవని నిరాకరిస్తున్నారని తెలియజేశారు. వెంటనే ఇళ్ల మంజూరుకు సంబంధించిన ధరఖాస్తులను సచివాయాల్లో తీసుకుని వాటిని ఆన్‌లైన్ చేసి ప్రభుత్వ నిబంబధనల మేరకు 90 రోజుల్లో అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలను, గృహాలను మంజూరు చేయాలన్నారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి లబ్ధిదారులు ఇచ్చిన ప్రతి ధరఖాస్తునూ ఆన్‌లైన్ చేయాలని సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు ఆదేశాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, రాయుడు, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ అధ్యక్షురాలు నసీంతాజ్, కార్యదర్శి విమల కుమారి, లక్ష్మీదేవి, రమాదేవి, శశికళ, సరస్వతమ్మ, రెడ్డమ్మ, సిఐటియు పట్టణ నాయకులు అత్తర్ బాబా, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలితో పాటు పేదలు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో ఆరోగ్యశ్రీ కార్డులు

వందశాతం పంపిణీ జరగాలి - కలెక్టర్ అరుణ్ బాబు



ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆరోగ్యశ్రీ కార్డులు మూడు రోజుల్లో 100 శాతం పంపిణీ జరగాలని, పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్ సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శనివారం నాడు కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్యతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, కుల గణన, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ, ఎన్నికలకు సంబంధించిన క్లైమ్‌లు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులు త్వరగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు కేవలం 16 శాతమే పంపిణీ జరిగిందన్నారు. ఈనెల 19 లోపు 100 శాతం కార్డులు పంపిణీ చేయాలన్నారు. నవరత్నాలలో భాగంగా నిర్మిస్తున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. గత నెల 22న తుది జాబితా, విడుదల చేసిన తరువాత జిల్లాలో సుమారు 40 వేల క్లైయిమ్స్ ఉన్నాయని వాటిని ఎన్నికల అధికారులు సమగ్రంగా విచారణ చేసి ఏవైనా తొలగింపులు ఉంటే జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో తొలగించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. 18 నుంచి 21 సంవత్సరాలు యువత ఉంటే ఫారం 6 ద్వారా ఓటర్ నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లాలోని ఆర్డీవోలు, తహశీల్దార్లు ఎంపీడీవోలు పాల్గొన్నారు.



ఖైదీలతో వివరాలు తెలుసుకుంటున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

సబ్ జైలులో ఉన్న ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక దష్టి సారించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ వైద్యాధికారి ఆనంద్‌కు సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలకు సంబంధించిన వివరాలను సబ్ జైలు అధికారి అంజినాయక్‌తో అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్‌జైలు గదులను పరిశీలించి, ఖైదీలతో నేరుగా సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. బెయిలు రాని నిందితులు ఎవరైనా ఉంటే తెలియజేయాలని సూచించారు. పిటి వారెంట్‌లపై జైలులో ఉన్న నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులు అనారోగ్యంతో బాధపడుతుంటే నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా అంతకు ముందు అదనపు జిల్లా ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించి అర్జీదారులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుదర్శన్, నాగరాజు రెడ్డి, నవేరా, పార్వతి, రవికుమార్, గోపాల్ , లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ ఇస్తాం : ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మండలం లోని గొట్లూరు గ్రామంలో రూ. 2.60 కోట్లతో నూత నంగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌ను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నియోజక వర్గానికి ఆర్‌డిఎస్ఎస్ స్కీం ద్వారా రూ. 150 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. పాత ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మమతా దేవి, డీఈలు నాగేంద్ర, శ్రీకాంత్ రెడ్డి, ఏఈలు జానకిరామయ్య, నజీరుద్దీన్, జడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, సర్పంచి పిట్ట నరసమ్మ, ఎంపిపి గిర్రక రమాదేవి, నాయకులు జి.మారుతి, కేశవరెడ్డి, పెద్దిరెడ్డి, నాగులూరు మంజునాథరెడ్డి, మల్కాపురం శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు 'ప్రజల గుండెల్లో లెనిన్' పుస్తకావిష్కరణ

కదిరి టౌన్ : పట్టణంలోని సైదాపురం ఆంజనేయస్వామి ఆలయ ఫంక్షన్ హాలులో ఆదివారం 'ప్రజల గుండెల్లో లెనిన్' పుస్తకావిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు రచయిత పిళ్లా కుమారస్వామిరెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్, న్యాయవాదులు నరసిం హులు, ప్రసాద్‌రెడ్డి, వామపక్ష పార్టీల నాయకులు ఆత్మీయ అతిథులుగా హాజరవుతారన్నారు. వామ పక్ష, సాహితీ అభిమానులు సభకు హాజరై జయప్రదం చేయాలని వామపక్ష ఐక్యవేదిక నాయకులు కోరారు.

శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం అవసరం

◆ ఫ్యూజన్ విజన్ ఫెయిర్ ప్రారంభంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి- హిందూపురం



చంద్రయాన్-3 గురించి వివరిస్తున్న విద్యార్థులు



విద్యార్థులు రూపొందించిన ప్రయోగాల గూరించి తెలుసుకుంటున్న కమిషనర్

విద్యార్థులు శాస్త్ర, సాంకేతికతను పెంపొందించుకుని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శనివారం నాడు శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫ్యూజన్ విజన్ ఫెయిర్-2024ను మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మి, పాఠశాల వ్యవస్థవక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక స్థాయి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు రూపొందించిన సుమారు 600కు పైగా ప్రయోగాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను సజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాలు విద్యార్థులకు దోహదం చేస్తాయన్నారు. ప్రస్తుత వైజ్ఞానిక ప్రదర్శనలో పుస్తక రూపంలో ఉన్న ప్రాజెక్టులే కాకుండా స్వతహాగా సొంత ఆలోచన విధానంతో తయారు చేసే విధంగా విద్యార్థులు ఆసక్తి కలిగించడం అభినంద నీయమన్నారు. ఇటీవల చంద్రయాన్-3 విజయవంతం కావాడం, దానిని ఎలా ప్రయోగించారు.. పని చేసే విధానం గురించి విద్యార్థులు రూపొందించిన రాకెట్ లాంచింగ్, విక్రమ్ రాడర్, అవి పని చేసే విదానంపై విద్యార్థుల వివరణ చాల అద్భుతంగా ఉందన్నారు. ప్రజలు మూఢనమ్మకాలు, మూఢవిశ్వాసాలను పారద్రోలి శాస్త్ర సాంకేతికతను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను తిలకించడానికి వివిధ పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నందకుమార్, ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రియాజ్, పాఠశాల హెచ్ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, పాఠశాల సుపరిటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, అబ్దుల్ రజాక్, నతీష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

జెవివి కార్యదర్శి డాక్టర్ ఈటి.రామ్మూర్తి

ప్రజాశక్తి-హిందూపురం



సైన్సు పట్ల విద్యార్థులకు వివరిస్తున్న జెవివి కార్యదర్శి డాక్టర్ ఈటి రామ్మూర్తి

విద్యార్థులు మూఢ నమ్మకాలను విడిచిపెట్టి సైన్స్‌పై అవగాహన పెంచుకుని, అందులో నిత్యం అన్వేషించాల్సిన అవసరం ఉందని జెవివి కార్యదర్శి డాక్టర్ ఈటి.రామ్మూర్తి తెలియజేశారు. జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నాడు శాస్త్రవేత్త బ్రూనో దినోత్సవాన్ని పురపాలక సంఘం పరిధిలోని కోట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం శోభ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి నాయకులు డాక్టర్ ఈటి రాంమ్మూర్తి, రామకృష్ణలు మాట్లాడుతూ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని విశ్వం అనంతమైనదని, ఈ విశ్వనికి కేంద్రం, సరిహద్దు ఏది లేదని ప్రచారం చేసిందుకు బ్రూనోను 17-02-1600లో ఆనాడు కొందరు సజీవ దహనం చేయించారన్నారు. సైన్స్ అభివృద్ధి కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వారి త్యాగఫలితమే నేడు అందరం అనుభవిస్తున్న సైన్స్ ఫలాలు అన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకుని శాస్త్రీయ దృకృథాన్ని పెంపోందిచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, రవినాయక్, అధ్యాపకులు యశోధ రాణి, యశోదదేవి, తిరుమలమ్మ, సరస్వతి, శ్రీలక్ష్మి, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన కొడిగెనహళ్లి విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి-పరిగి

ఎంసెట్-2024లో కొడిగెనహళ్లి ఎపిఆర్ఎస్ ఎక్స్‌లెంట్ పాఠశాల విద్యార్థి ఎం.మహేష్‌బాబు జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు హెచ్ఎం మురళీధర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మహేష్‌బాబు శనివారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రూ. 8వేల నగదుతో పాటు జ్ఞాపిక అందుకున్నాడనితెలిపారు. మండల స్థాయిలో పి.మునీంద్ర పదో తరగతి మొదటి ర్యాంక్ కైవసం చేసుకున్నాడని ప్రిన్సిపల్ తెలిపారు. వీరికి శిక్షణలో అండగా నిలిచిన రామమునిరెడ్డిని, విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.



నగదు బహుమతితో పాటు జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థి మహేష్‌బాబు

ఏం సాధించారని 'సిద్ధం' సభ

సిఎం జగన్‌కు రఘువీరా సూటిప్రశ్న

ప్రజాశక్తి-మడకశిర



విలేకరులతో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

ఐదేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏం సాధించారని సిఎం జగన్ రాప్తాడులో సిద్ధం సభ నిర్వహిస్తున్నారని సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి సూటిగా ప్రశ్నించారు. పట్టణంలోని నీలకంఠ కోల్డ్ స్టోరేజ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు జిల్లాలో రైతులు, రైతు కూలీలను ఆదుకోవడానికి గతంలో కేంద్ర ప్రభుత్వం 'ప్రాజెక్టు అనంత' పేరుతో రూ. 7,760 కోట్లు మంజూరు చేసిందని, అయితే గత ప్రభుత్వం పూర్తి చేయలేదు మీరు ఆ పని చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. రాయదుర్గం ప్రాంతంలో కుదిరేముఖ్ ఖనిజ పరిశ్రమ, మడకశిర, కళ్యాణదుర్గం, కదిరి ప్రాంతాల్లో ఎపిఐసిసి భూముల్లో పరిశ్రమలు నిర్మించడానికి మీరు సిద్ధమా అన్నారు. ఐదేళ్లలో ఏ ఒక్క కార్యక్రమం చేపట్టని మీరు సిద్ధం సభకు ఏ మొఖం పెట్టుకొని వస్తున్నారని ప్రశ్నించారు. ఆయా పనులన్నీ పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, గౌడప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది విధులను బాధ్యతగా నిర్వర్తించాలని నోడల్ అధికారి శివారెడ్డి ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి-1, రెండు సచివాలయాలను శనివారం ఆయన సందర్శించి వారి వారి శాఖల విధి నిర్వహణ, విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభు త్వం ద్వారా ప్రజలకు 544 సేవలు అందించాలన్న లక్ష్యాన్ని గుర్తించి చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అనిత, సాయిమోహన్, శివశంకర్‌రెడ్డి, వంశీకృష్ణ, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల ఆన్‌లైన్‌పై తహశీల్దార్ హామీ

ప్రజాశక్తి-గోరంట్ల



పేదలతో మాట్లాడుతున్న తహశీల్దార్ అక్బర్‌బాషా, పోలీసు అధికారులు

మండలంలోని పాలసముద్రం సమీపంలో జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వీరు రాత్రి కూడా అక్కడే నిద్రించారు. వంటావార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. వీరికి కెవిపి ఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సిఐటియు మండల కార్యదర్శి కొండా వెంకటేష్ మద్దతు తెలిపారు. పేదలు మాట్లాడుతూ పట్టా కోసం ఇచ్చిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో తహశీల్దార్ కార్యాలయం లోకి వెళ్లడానికి రెవెన్యూ అధికారులు ప్రయత్నించగా పేదలు అడ్డుకున్నారు. స్పందించిన తహశీల్దార్ అక్బర్‌బాషా గుడిసెలు వేసుకున్న వారి రేషన్‌కార్డు, ఆధార్ కార్డులను పరిశీలించి అర్హుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో పేదలు ఆందోళన విరమించారు.

ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జెఎసి నాయకులు డిమాండ చేశారు. ఈ మేరకు ఉద్యోగ జెఎసి సంఘాల ఆధ్వర్యంలో పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్‌టియు నాయకులు కోనంకి చంద్రశేఖర్, లింగా రామ్మోహన్, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులకు ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు ఉన్నాయన్నారు. సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాల్సి ఉంద న్నారు. అన్ని శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాల న్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ 70-75 ఏళ్ల మధ్య వయస్సున్న వారికి పెన్షన్ 10శాతం, 75-80 మధ్య వయస్సున్న వారికి 15 శాతం మంజూరు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ వేసినప్పటికీ నేటికీ ఏ మాత్రం ప్రగతి లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యంతర భతి (ఐఆర్) 30 శాతం ప్రకటించాలన్నారు. సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, 11వ పీఆర్సీ, డిఎ, టిఎ బకాయిలు తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర స్థాయి ఆందోళనలు చేపడతామని తెలియజేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రానిన ఆర్డీవో భాగ్యరేఖకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు నాగార్జున శెట్టి, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.చంద్ర, ఎంఇఒ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపాల్ నాయక్, పీడీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రామకష్ణ, సర్వ శిక్ష అభియాన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ, పెన్షనర్ల జెఎసి నాయకులు

డిమాండ్లు నెరవేర్చకపోతే పోరాటమే : ఎపి జెఎసి ఛైర్మన్ నరసింహులు

హిందూపురం : రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని ఎపి జెఎసి ఛైర్మన్ నరసింహులు, కార్యదర్శి మారుతిశ్రీనివాస్ హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ జెఎసి నాయకులతో ముఖాముఖి చర్చలు జరిపి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, జమ్మన్న, శివన్న, వెంకటేష్, బాబు, అంజనమూర్తి, వాసు, శివ, గంగాధర్, రాజన్న, రామకృష్ణ, రాజేశ్వరి, పార్వతమ్మ పాల్గొన్నారు.

మడకశిర : డిమాండ్ల సాధన కోసం శనివారం తాలూకా ఎపి జెఎసి ఆధ్వర్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, జెఎసి నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో తాలూకా ఛైర్మన్ రాము, ఎపి ఎన్‌జిఒ తాలూకా ఉపాధ్యక్షుడు టి.హరినాథ్, తాలూకా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.మల్లికార్జున, కార్యదర్శి ఫకృద్దీన్, ఉపాధ్యక్షులు గణపతి, యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప, ఎస్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఆదినారాయణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు తిప్పేస్వామి, దొరబాబు, జిల్లా ఎపిటిఎఫ్ కార్యదర్శి లతారామక్రిష్ణ, మండల అధ్యక్షులు వెంకటేష్, తాలూకా ఎపిజిఇఎ అధ్యక్షులు భూతేగౌడ్, మున్సిపల్ కార్యాలయ జెఎసి నాయకులు నజీర్ అహ్మద్, నాగరాజు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎపిఎస్ ఆర్‌టిసి ఎన్‌ఎంయు అధ్యక్షులు రామకృష్ణ, సెరికల్చర్ శాఖ మల్లప్ప, నాగరాజు, ఉద్యోగులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : ఎన్‌ఎంయు, ఎపిజెఎసి తాలూకా శాఖ ఆధ్వ ర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిమోహన్, ఎన్‌వి రమణ మాట్లాడుతూ కరువుభత్యంతో వేతన సవరణ చేయడం వల్ల ఆర్టీసీ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయార న్నారు. జెఎసి ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ చలో పుట్టపర్తి, 27న చలో విజయవాడకు పిలుపునిచ్చారని, ఉద్యోగులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మజ్దూర్ అసోసియేషన్ డిపో కార్యదర్శి బైరిశెట్టి, అజీజ్, నరసింహులు, లక్ష్మీదేవమ్మ, అనితమ్మ, ఉమాదేవి, మాధవిదేవి, అశ్వర్థమయ్య, ఎస్‌వి.రమణ, డి.లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, ఆదినారాయణ పాల్గొన్నారు.

'సిద్ధం' సభను జయప్రదం చేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహిస్తున్న సిఎం జగన్ సిద్ధం సభను 10 లక్షల మందితో జయప్రదం చేద్దామని ఎమ్మెల్యే పలమనేరు తిప్పేస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి-జనసేన-బిజెపి ఒక్కటైనా వైసిపిని ఏమీ చేయలేర న్నారు. సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి సోనియాగాంధీకి గిఫ్ట్ ఇవ్వాలని చూస్తున్నారని అది జరగదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి వైఎస్‌ఆర్ అభిమాని, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు సిద్ధం సభకు హాజరవ్వాలన్నారు. బస్సుల్లో వెళ్లలేని వారికి ఇతర వాహనాలను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపిలు రాధమ్మ, కవితా సత్యనారాయణ, ఈరన్న, జడ్పిటిసి సారక్క నరసింహారెడ్డి, జయరాజ్, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపిటిసి సుభద్రనాగేంద్ర, నాగన్న, చంద్రప్ప, చిత్రశేఖర్, మోతిరామ్‌నాయక్, సర్పంచి నారాయణప్ప, శివకుమార్, శ్రీనివాస్, మంజునాథ్, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

సిద్ధం సభకు తరలిరండి : నవీన్ నిశ్చల్

హిందూపురం : రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సిఎం జగన్ ఎన్నికల శంఖారావం పూరించడానికి ఏర్పాటు చేసిన సిద్ధం సభకు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని ఎపి ఆగ్రోస్ కార్పొరేషన్ ఛైర్మన్ నవీన్‌నిశ్చల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం జగన్ ప్రజా సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. టిడిపి ప్రభుత్వంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం మరచి వారి స్వార్థ ప్రయోజనాల కోసం పని చేశారని విమర్శించారు. ఎవరు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా వైసిపి విజయం ఖాయమన్నారు. సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి 10వేల మంది నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బస్సుల రాకపోకల రవాణా సౌకర్యంతో పాటు తాగునీరు, భోజనం, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

యువత ఓటే కీలకం : కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

సార్వత్రిక ఎన్నికల్లో యువత ఓటే కీలకమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో శనివారం టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో 'ఓట్ ఫర్ సిబిఎన్' కార్యక్రమం నిర్వహించగా కందికుంట ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ఎన్నికల సమ యంలో జగన్ ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని వాగ్దానం చేసి మాట తప్పాడన్నారు. దీంతో యువ త ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్లే దుస్థితి తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు పాలనలో నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంటు, విదేశీ విద్యాదీవెన అందించగా జగన్ వాటిని అట కెక్కిం చారని ఆరోపించారు. యువతకు ఉద్యోగావ కాశలు రావాలంటే టిడిపితోనే సాధ్యమని, కావున రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు.



'ఓట్ ఫర్ సిబిఎన్' కార్యక్రమంలో పాల్గొన్న కందికుంట

పలువురు టిడిపిలో చేరిక

రూరల్ మండలంలోని ముత్యాల చెరువు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరగా కందికుంట వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జయచంద్రారెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, బాబాఫకృద్దీన్, శ్రీరాములు, క్రిష్టప్ప, నరసమ్మ, సురేష్, లక్ష్మీదేవి, కే.లక్ష్మీదేవి, రాజశేఖర్, గంగన్న, హరి, రామ్మోహన్, సుధీర్, లోకేష్, ఉత్తప్ప తదితరులు ఉన్నారు.

బాధితుడికి 'కందికుంట' ఆర్థిక సాయం

నల్లచెరువు : మండలంలోని ఉబిచెర్ల గ్రామంలో రెండు రోజుల క్రితం గ్యాస్ సిలిండర్ పేలి రెడ్డప్ప ఇల్లు పూర్తిగా దెబ్బతింది. స్థానిక టిడిపి నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ శనివారం ఆ గ్రామం వెళ్లి బాధిత రెడ్డప్ప కుటుంబ సభ్యులను ఓదార్చి రూ. 50 వేలు అందజేసి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు అంజనప్ప, లక్ష్మీపతినాయుడు ఉన్నారు.



చిన్నారితో ముచ్చటిస్తున్న జెసి అభిషేక్‌కుమార్

పోలింగ్ కేంద్రాల తనిఖీ

లేపాక్షి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బయన్నపల్లి, లేపాక్షి, కంచిసముద్రం, సిరివరం, మద్దిపి, మానేంపల్లి పంచాయతీల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. అలాగే పాఠశాలలో కొద్దిసేపు చిన్న పిల్లలతో ముచ్చటించారు. జెసి వెంట ఎంపిడిఒ వాసుదేవగుప్తా, ఎంఇఒ నాగరాజునాయక్, కుళ్లాయప్ప, ఇంజినీర్ హనుమనాయక్, సెక్రటరీ మల్లికార్జున ఉన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

ధర్మవరంటౌన్ : ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని హైదరా బాద్‌కు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణులు క్రిష్ణ సూచించారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో శనివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. క్రిష్ణ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలంటే ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కష్ట పడి చదవాలన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్య సిస్తే దేనినైనా సాధించవచ్చన్నారు. గురువులు, తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, హోమియో వైద్యులు ఆదిశేషు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

కొత్తచెరువు : జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఖాజీసహీరాబేగం తెలి పారు. ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చినందుకు జిల్లా వ్యాప్తంగా పర్యటించి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. మహిళల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్ర మంలో మండల కన్వీనర్ బెల్లం నజీర్, నాయకులు మోహన్, సనాఖాన్, శామీర్ పాల్గొన్నారు

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

ఓబుళదేవరచెరువు : అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, శాంతియుత ఉద్యమాలను ఆపడం సమంజసం కాదని సిపిఎస్ ఉద్యమకారు లు, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు గౌస్ లాజమ్ పేర్కొన్నారు. ఒడిసిలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎపిసిపిఎస్ఇఎ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ జరిగే 'ఓట్ ఫర్ ఒపిఎస్' 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని భగ్నం చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నోటీసులు ఇచ్చి ఉద్యమాన్ని అణిచివేయడం తగదన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలుపరచాలని, లేనిచో ఆందోళనలు నిరంతరం జరుగుతూనే ఉంటాయని హెచ్చరించారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-అమరాపురం

మండలంలోని హేమావతి పంచాయతీ కెంపకనహట్టి గ్రామంలో తాగునీటి సమస్యపై శనివారం మహిళలు ఖాళీ బిందెలతో ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపి కార్యాలయ సూప రింటెండెంట్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. మహిళలు రాధ, లలితమ్మ, రంగమ్మ, గౌరమ్మ, భాగ్య మ్మ మాట్లాడుతూ తాగునీటి బోరు చెడిపోవడంతో గ్రామంలో 6 నెలల నుంచి సమస్య తీవ్రమైందని, దీంతో బోరు బావులను ఆశ్రయిస్తున్నామని వాపోయారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు దిగామన్నారు. 3 రోజుల్లోగా బోరు మరమ్మతులు చేయించి తాగునీరు ఇవ్వకపోతే మళ్లీ ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరవధిక ధర్నా చేస్తామని హెచ్చరించారు. స్పందించిన సూపరింటెండెంట్ పంచాయతీ కార్యదర్శి నరేష్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

మహిళ బ్యాంకు ఖాతాలో రూ. 1.40 లక్షలు మాయం

ప్రజాశక్తి-రొద్దం

కెనరా బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో రొద్దం బ్యాంకు శాఖలో తన ఖాతా నుంచి రూ. 1.40 లక్షలు మాయమైనట్లు రెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాధితురాలు వాపోయింది. 15 రోజుల క్రితం ఆమెకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి కెనరా బ్యాంకు మేనేజర్‌నని నమ్మబలకడంతో ఆమె ఒటిపి, ఆధార్ నంబర్ తెలిపింది. 10 నిమిషాల్లో రూ. 20 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ రావడంతో మోసపోయానని గుర్తించి రొద్దం కెనరా బ్యాంకుకు వెళ్లి ఎటిఎం బ్లాక్ చేయాలని కోరింది. అలాగే ఆమె భర్త 3 నెలల క్రితం మృతిచెందగా అతడి ఖాతాలో ఉన్న సొమ్మును పెనుకొండ ఎస్‌బిఐ ఖాతాకు బదిలీ చేయమని కోరింది. అయితే వారు అలా మార్చడానికి కుదరదని తెలుపడంతో పాటు ఎటిఎం బ్లాక్ చేశామని తెలిపారు. అయితే మరుసటి రోజు ఒకేసారి రూ. 1.40 లక్షలు డెబిట్ అయినట్లు మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె బ్యాంకు వద్దకు వెళ్లి అధికారులకు విషయం తెలిపింది. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

హిందూపురం : మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం నిర్వహణలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్ప వని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. కమిషనర్ శనివారం తన ఛాంబర్‌లో శానిటరీ సెక్రటరీలతో పారిశుధ్యం, ట్రేడ్ లైసెన్స్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెక్రటరీలు నిత్యం వారి సచివాలయాల పరిధిలో ఉండి పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు తీసుకోవా లన్నారు. గడువులోగా ట్రేడ్ లైసెన్స్‌లను వసూలు చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవ న్నారు. కార్యక్రమంలో ఎఇ నాగేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

టిడిపి శ్రేణులకు 'గుండుమల' పరామర్శ

మడకశిర : మండలంలోని వివిధ గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారితో పాటు మృతిచెందిన వారి కుటుంబాలను శనివారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పరామర్శించారు. బుల్లసముద్రం గ్రామంలో సీనియర్ నాయకులు పూజారి గంగప్ప అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కంటిపురం గ్రామంలో సీనియర్ నాయకుడు హనుమంతప్ప మృతిచెందగా మృతదేహాన్ని సందర్శించి ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. అయ్యవారి పల్లి మాజీ ఎంపిటిసి ముద్దరంగప్ప ఇటీవల మృతిచెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు జయపాల్, నాగేంద్ర, నగేష్, బాలకృష్ణ, సంజీవప్ప, నరసగౌడ్, హనుమంతప్ప, రాజు, గోపాల్, తిప్పేస్వామి, పెన్నప్ప, ఆదినారాయణ, నాగరాజు, పరిటాల రంగనాథ్, మారుతి, వై.కుమార్, బి.శివ, టి.నాగరాజు, మూర్తి, క్రిష్టప్ప, వైబి రంగనాథ్ ఉన్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మడకశిర : మండలంలోని బుల్లస ముద్రం మాజీ ఎంపీటీసీ పూజారి గంగప్ప అనా రోగ్యంతో బాధపడుతుండగా శనివారం మాజీ ఎమ్మెల్యే కె.ఈరన్న వారి ఇంటికి వెళ్లి పరామర్శిం చారు. అమిదాల గొంది పంచాయతీ హెచ్‌ఆర్. పాల్యం గ్రామానికి చెందిన టిడిపి నేత ఓబుళప్ప, జమ్మనిపల్లి గ్రామానికి చెందిన రవికాంత్ ఆసుపత్రి లో చికిత్స పొందుతుండగా పరామర్శించారు. ఆయన వెంట నాయకులు అశ్వర్థమప్ప, కృష్టప్ప, ఈశ్వరప్ప, మూర్తినాయక్, మల్లేశప్ప, అజయ్, హేమంత్, నరసయ్య ఉన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కొత్తచెరువు : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండ్లపల్లి రాజు, జిల్లా అధికార ప్రతినిధి లోచర్ల పెద్దన్న, జిల్లా కార్యదర్శి రామచంద్ర కోరారు. కొత్త చెరువులో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో సిఎం జగన్ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇవ్వడంతో వాల్మీకులు అత్యధిక శాతం వైసిపికి ఓటు వేసి గెలిపించార న్నారు. ఐదేళ్లు పూర్తవుతున్నా సిఎం జగన్ ఆ హామీని నెరవేర్చలేదని, వైసిపికి రాబోయే ఎన్నికల్లో వాల్మీకుల సత్తా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో చంద్ర, రామంజి, సుబ్బరాయుడు, నరసన్న, కొండప్ప పాల్గొన్నారు.

రామాలయానికి బీరువా వితరణ

ఓబుళదేవరచెరువు : మండల శ్రీవం సిద్ధి వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శనివా రం స్థానిక పాత రామాలయానికి చిన్న బీరు వా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పి.ప్రభాకరరెడ్డి, కె.నాగేశ్వరయ్య, పి.నాగ రాజయ్య, ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి, దివాకర్‌రెడ్డి, సమితి అధ్యక్షుడు నరేష్‌బాబు, ఉపాధ్యక్షులు ఎస్.అరవింద్, కార్యదర్శి ఈ.రమణ, ప్రధాన కార్యదర్శి టి.గణేష్, కోశాధికారి ఈ.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు యు.సతీష్, బి.నారాయణస్వామి, ఈ.హరి పాల్గొన్నారు.

వైసిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా కంబాలప్ప

సోమందేపల్లి : మండలంలోని బ్రహ్మ సముద్రం గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నేత కంబా లప్పను ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించి అవకాశాలు కల్పిస్తుందని, అందుకు నేనే నిదర్శనమన్నారు. నా మీద నమ్మకం ఉంచి అప్పజెప్పిన బాధ్యతకు న్యాయం చేసేలా పని చేస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలమత్తూరు : మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శెట్టిపల్లికి చెందిన తిప్పన్న(35) మృతి చెందాడు. తిప్పన్న ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు. తిప్పన్నకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిపై రఘువీరా విమర్శలు తగదు

మడకశిర : సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించడం తగదని వైసిపి రాష్ట్ర సం యుక్త కార్యదర్శి రవిశేఖర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో శనివా రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదవీ వ్యామోహంతో రాష్ట్రం విడిపోవడానికి ప్రధాన కారణమైన రఘువీరా మంత్రిని విమర్శించడం ఎంతవరకూ సమంజసమన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పరిటాల కుటుంబంతో సన్నిహితంగా ఉంటూ జిల్లాలో సొంత పార్టీని నీరుగారిచ్చింది వాస్తవం కాదా అన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ ఎస్సీసీఎస్ బాలుర హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు గోర కాటి పెద్దారెడ్డి పాఠశాలకు రూ. 2.9 లక్షల విరాళం ఇచ్చాడు. దీంతో శనివారం పాఠశాలలో హెచ్‌ఎం బల్ల భాస్కర్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి గోరకాటి పెద్దారెడ్డిని ఉపాధ్యాయులు పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పెద్దారెడ్డి కృషితో పదేళ్లుగా ఆంగ్లం సబ్జెక్టులో వంద శాతం ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఆయన 'వార్' ప్రోగ్రాంను ప్రారంభించి, విద్యార్థులకు రాయడం, చదవడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంఉటున్నారని కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పెద్దారెడ్డిని సన్మానించిన ఉపాధ్యాయులు

ఐకమత్యంతో ముందుకు సాగుదాం

కదిరి అర్బన్ : బలిజ సామాజిక వర్గం ప్రజలు ఐకమత్యంతో ముందుకు సాగుతామనడానికి శ్రీకృష్ణదేవరాయలు జయంతి కార్యక్రమం విజయవంతం కావడమే నిదర్శనమని బలిజ సేవా సంఘం నాయకులు రమేష్‌బాబు, జనసేనపార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని బలిజ సంఘం కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాలతో పాటు జిల్లా పలు ప్రాంతాల నుంచి తరలివచ్చి శ్రీకష్ణదేవరాయలు జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రొద్దం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఎపి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు నల్లూరు నాగరాజు ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన సప్తగిరి హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో సప్తగిరి హాస్పిటల్ వైద్యులు జయవర్ధన గౌడ్, నరేష్, నాగిరెడ్డిపల్లి నాగరాజు, నరసింహులు, ఎమ్మార్పీఎస్ పెద్దన్న, కదిరప్ప, ఓబులేశు, బాలు, మాలమహానాడు మండల అధ్యక్షులు ఎం. అంజనప్ప, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్చ్ నిర్మాణ పనులు ప్రారంభం

హిందూపురం : పట్టణంలోని కోట ప్రాంతంలో ఆర్చ్ నిర్మాణానికి శనివారం వైసిపి ఇన్‌ఛార్జి దీపిక భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం 27వ వార్డుతో పాటు, పాండురంగనగర్‌లో మురుగు కాలువల పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఒక్క రోజే రూ. 25 లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించామని, పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు ఎంఇ వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



భూమిపూజ చేసి పనులను ప్రారంభిస్తున్న దీపిక

టిడిపి ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-ముదిగుబ్బ

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామాల బాధితులకు పరిహారం అందేదె ప్పుడని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరి టాల శ్రీరామ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలం లోని పిసి రేవు, హుస్సేన్‌పురం గ్రామాల్లో శనివారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ పాల్గొన్నా రు. ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ చిత్రా వతి బ్యాలె న్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామాల రైతులకు నేటికీ నష్టపరిహారం అందలేదని ఆయన దృష్టికి రాగా శ్రీరామ్ స్పందించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టో లోని పథకాలను ప్రజలకు వివరించా రు. టిడిపి విధానాలు నచ్చి పలువురు టిడిపిలోకి చేరగా శ్రీరామ్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

మడకశిర : రొళ్ల మండలంలోని బిజి హళ్లి, ఉనిసేకుంట, ఎం.రాయపురం, సోమఘట్ట, చిగమతఘట్ట, గ్రామాల్లో శనివారం నియోజకవర్గ టిడిపి డాక్టర్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కొంకల్లు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్య త్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. కృష్ణ మూర్తి మాట్లాడుతూ వైసిపిని గద్దె దించే సమయం ఆసన్నమైందన్నారు. ప్రజలు వైసిపి దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయాలని, టిడిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, తిప్పేస్వామి పాల్గొన్నారు.



పరిటాల శ్రీరామ్ సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ధర్మవరం టౌన్ : టిడిపి పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 7వ వార్డులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. తెలుగుతమ్ముళ్లు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టో పథకాలను, వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. వార్డులో నెలకొన్న సమస్యలను తెలుసుకుని టిడిపి అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు మాదన మహేశ్వరి, చౌడమ్మ, స్వర్ణకుమారి, మున్ని, శారద, నాగరత్న, నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లి షరీఫ్, అంబటి సనత్, కరెంటు ఆది, పల్లపు రవీంద్ర, పల్లపు శివశంకర్, గోసల శ్రీరాములు, మాధవరెడ్డి, మారుతిస్వామి, అత్తార్ రహీంబాషా, మాదన సుబ్బయ్య, ప్రకాశ్, పుట్లూరు సంజీవులు, ఉస్మాన్, నాగేంద్ర, చెలిమి శివరాం, సురేశ్, వాసుదేవ, వీర, పాల్గొన్నారు.

పిల్లల పండుగకు నాలుగేళ్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



జిల్లాలో ఏటా జనవరి మాసం తరువాత నిర్వహించే పిల్లల పండుగకు నాలుగేళ్లు పూర్తయ్యాయి. అనంత బాలోత్సవం పేరుతో కమిటీ ఆధ్వర్యంలో ఏటా పిల్లలకు పోటీలు నిర్వహిస్తూ వస్తున్నారు. మధ్యలో కొవిడ్ సమయంలో ఒక ఏడాది నిర్వహించలేదు. తక్కిన ఏడాది ఏటా జనవరి తర్వాత నిర్వహించడం.. ఇందులో పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను భాగస్వామ్యులను చేస్తూ వస్తున్నారు. ఏడాదికి ఏడాది ఇందులో పాల్గొంటున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తుండటం గమనార్హం. ఈఏడాది ఫిబ్రవరి 12, 13, 14 తేదీల్లో మూడు రోజులపాటు అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ మూడు రోజులు పిల్లలు ఎంతో ఉత్సహంగా ప్రదర్శనలు ఇచ్చారు. ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టడంతోనే సరిపోయే పిల్లలకు మూడు రోజులు ఆటవిడుపుతోపాటు తమలో దాగి ఉన్న ప్రతిభను చాటుకునే అవకాశం కావడంతో ఎంతో ఉత్సహంగా పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో ఇతర పిల్లలకు ధీటుగా ప్రదర్శనలిచ్చేందుకు తల్లిదండ్రులు కూడా వచ్చి ప్రోత్సహిస్తుండటం కనిపించింది. ఈ నాలుగు పండుగలను ఎంతో విజయవంతంగా సజావుగా నిర్వహించడంలో బాలోత్సవ కమిటీ చేస్తున్న కృషి ఎంతగానో ఉందని చెప్పాలి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆయా రంగాల్లో నిపుణులుగా ఉన్న వారిని కూడా భాగస్వామ్యులను చేసి ఉత్సవాలను నిర్వహించారు. మొత్తంగా ఈవారం బాలోత్సవం ఎంతో ఉల్లాస భరిత వాతావరణంలో జరిగిందని చెప్పవచ్చు. ఇకపోతే ఎన్నికల సమయం కూడా ఆసన్నమవుతుండటంతో రాజకీయాలు వేగం పుంజుకున్నాయి. ఈ వారంలో నారా భువనేశ్వరి సత్యసాయి జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు జైలుకెళ్లిన సమయంలో చనిపోయిన వారి కుటుంబాలను కలసి వారికి పరిహారాన్ని అందజేశారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమేనంటూ ధీమాను వ్యక్తి చేసి టిడిపి శ్రేణుల్లో ఉత్సహం నింపే కార్యక్రమం చేపట్టారు. ఇదే సమయంలో వైసిపి రాయలసీమ స్థాయి బహిరంగ సభను నిర్వహించేందుకు సమాయత్తమైంది. రాప్తాడులో బహిరంగ సభను నిర్వహించాలని తలపెట్టింది. ఈనెల 11న సభ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో ఈనెల 18కి వాయిదా వేశారు. రాయలసీమ జిల్లాల నుంచి పెద్దఎత్తున జనసమీకరణ చేయడం ద్వారా బల ప్రదర్శన చేయాలని వైసిపి భావిస్తోంది. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈవారంలో ఎక్కువ సమయం ఇక్కడే ఉండి ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. దీంతో వైసిపి శ్రేణుల్లో సభకు సంబంధించి హడావుడి నడుస్తోంది. కాంగ్రెసు రాయలసీమ స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించింది. ఈనెల 26న అనంతపురం నుంచే ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెడతామని ప్రకటించారు. దీనికితోడు కాంగ్రెస్ పార్టీ అధినేత ఖర్గే కూడా జిల్లాకు రానున్నారు. ఇలా అన్ని పార్టీలు ఎన్నికల ప్రచారాలను ఇప్పటికే ప్రారంభించే పనిలోనున్నాయి. టిడిపి, వైసిపి, కాంగ్రెసు ఇలా అన్ని పార్టీల్లోనూ ఎన్నికల హడావుడి మొదలైందనే చెప్పవచ్చు. వచ్చే వారానికి ఇవి మరింత ఊపందుకునే అవకాశాలూ ఉన్నాయి. టిక్కెట్లన వచ్చే వారంలో టిడిపి చాలా వరకూ ప్రకటించే అవకావాలున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇవి వస్తే ఇక రాజకీయ సందడి మరింతగా పెరిగనుంది. ఇప్పటికే వైసిపి సగం స్థానాలకు ప్రకటించియుంది. ఇక టిడిపి సీట్ల ఖరారూ పూర్తయితే రాజకీయ వేడి మరింత పెరగనుంది.